తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి : గాలి భాను

నగరి (పుత్తూరు), ఏప్రిల్ 11 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గం పరిధిలోని పలు రైల్వే క్రాస్‌ల వద్ద రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ క్రాస్‌ల వద్ద ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను, రైల్వే కన్సల్టెన్సీ ప్రతినిధులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశించారు. ఈ విషయమై ఆయన తిరుపతిలోని తన స్వగృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతఊూ నగరి మునిసిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పం 49వ రైల్ గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి, పుత్తూరు పట్టణంలోని మరాఠీ గేట్ 55వ నెంబరు రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి, ఆర్డీఎం రైల్వే గేట్ (56) దగ్గర ఓవర్ బ్రిడ్జి, వడమాలపేట మండలం పూడి క్రాస్ 67వ నెంబరు రైల్వే గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతిపాదనలను ఉన్నత స్థాయి అధికారుల



ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పరిశీలనకు పంపి పనులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంలో రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిలను నిర్మించి ప్రజల కష్టాలు తీర్చేందుకు కట్టుబడి వున్నట్టు తెలిపారు. ఓవర్ బ్రిడ్జిలు నిర్మించే ప్రాంతాల్లో లైట్ వెహికల్స్ కోసం సబ్‌వేల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలన్నారు. సమీక్షలో ఆర్ అండ్ బి చిత్తూరు ఇఇ శ్రీనివాసులు, తిరుపతి ఇఇ మధుసూదన్, పుత్తూరు డిఇ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

**- తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని ఎస్పి హర్షవర్ధన్ రాజు కొనియాడారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తన క్యాంపు కార్యాలయం నందు మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహాత్మా పూలే గారు ఏప్రిల్ 11, 1827న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు. మహాత్మా జ్యోతిబా పూలే సంఘసంస్కర్త, కుల వ్యతిరేక కార్యకర్త, ఆలోచనాపరుడు, రచయిత, జ్యోతిబా పూలే. అతను విద్య, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం మరియు కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారు. 1848లో తన భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి పూణేలో బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన మొదటి వ్యక్తి, ఇది భారతదేశంలో మహిళా విద్యకు విప్లవాత్మక అడుగు అని, ఆడ శిశువుల హత్యలకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించారని, సామాజిక న్యాయం కోసం పోరాడిన విజేతగా, అసంఖ్యాక ప్రజలకు ఆశాజనకంగా, సామాజిక సమానత్వం, మహిళా సాధికారత, విద్యను పెంపొందించడం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని జిల్లా ఎస్పీ కొనియాడారు. అప్పట్లో నీటి ఎద్దడిని అధిగమించేందుకు, నీటి సంక్షోభం పరిష్కారానికి ఉద్యమాలు చేసిన గొప్ప ఆలోచనాపరుడు జ్యోతిబా పూలే అని అన్నారు. దోపిడీకి గురైన కులాల వ్యక్తులకు సమాన హక్కులు సాధించడం సమాజ లక్ష్యంగా జ్యోతిబా పూలే తన అనుచరులతో కలిసి సత్యశోధకుల సంఘం లేదా సత్యశోధక్ సమాజ్‌ని స్థాపించి నవ భారతావని నిర్మాణానికి విశేష కృషి చేశారని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు , డిఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు, రమణారెడ్డి, రమణ, శివారెడ్డి, ఆర్ఎస్ఐ లు, పుల్లన్న, నభియా తదితరులు పాల్గొన్నారు.

# డిఆర్‌ఓ చెవిలో పువ్వు

**- పారదర్శక పదోన్నతుల బదిలీ కౌన్సెలింగ్‌కు పాతర వేసిన వైద్యశాఖ అధికారులు - కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించిన ఉద్యోగ సంఘాలు**



చిత్తూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఎఎన్ఎంల పదోన్నదుల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించడానికి వచ్చిన జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌కు వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పదోన్నతుల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహించి చెవిలో పువ్వు పెట్టారు. గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంల రెండు రోజుల పదోన్నతుల కౌన్సెలింగ్‌లో గురువారం పదోన్నతుల కౌన్సెలింగ్ పక్కాగా జరిగిన ప్పటికీ శుక్రవారం మాత్రం అభాసుపాలైంది. వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలోని ఒకరిద్దరు అధికారులు పదోన్నతుల పోస్టింగ్ కోసం డబ్బులు తీసుకుని వారికి అనుకూలంగా పోస్టింగ్స్ వచ్చేటట్లు చేసినట్లు ప్రస్తుతం విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. ఎఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ పర్యవేక్షణ కోసం జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వేదికపై వున్నప్పటికీ ఈ కౌన్సెలింగ్‌లో కొంతమంది ఎఎన్ఎంలకు భారీగా అన్యాయం జరిగినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పదోన్నతుల కౌన్సెలింగ్‌లో వైద్యశాఖ పదోన్నతుల సెక్షన్ సూపరిటెండెంట్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్‌కు మంచి ఆదాయం లభించినట్లు రెండవ రోజు పదోన్నతుల కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే వైద్య ఉద్యోగులు చెప్పుకోవడం కన్పించింది. కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి 298 మంది ఎఎన్ఎంలకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పదోన్నతుల కౌన్సెలింగ్ జరుగాల్సి వున్నప్పటికీ ఈ పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రారంభ రోజైన గురువారం జిల్లా రెవెన్యూ అధికారి హాజరై పదోన్నతుల కౌన్సెలింగ్ పక్కాగా జరుగుతుందని, ఎవరు ఏమి భయపడాల్సిన పని లేదని, కౌన్సెలింగ్‌కు కేవలం కౌన్సెలింగ్‌కు వచ్చిన వారు మాత్రమే వుండాలని యూనియన్ నాయకులు, పత్రికా విలేకరులు వెళ్ళిపోవాలని సూచించారు. ఈ మేరకు పదోన్నతుల కౌన్సెలింగ్ పక్కాగా జరుగుతుందని భావించిన యూనియన్ నాయకులు అక్కడి నుండి నిష్క్రమించారు. మొదటి రోజు గురువారం పదోన్నల కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం కౌన్సెలింగ్‌కు హాజరైన వారు పక్కాగా జరిగిందని చెప్పడంతో ఇందులో ఎలాంటి తిరకాసు లేదని డిఆర్ఓ మోహన్‌కుమార్ దగ్గరుండి పదోన్నతుల కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్నారని అందరు భావించారు. అయితే రెండవ రోజు మాత్రం వేదికపై జిల్లా రెవెన్యూ అధికారితో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వున్నప్పటికీ కొంతమంది వైద్యశాఖ అధికారులు తమకు ఇష్టమొచ్చిన వారికి ఇష్టమైన ప్రదేశాల్లో పోస్టింగ్ వచ్చేలా చేసి వేదికపై వున్న డిఆర్ఓ మోహన్‌కుమార్‌తో పాటు డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి చెవుల్లో పువ్వులు పెట్టారు. రెండవ రోజు జరిగిన పదోన్నతుల కౌన్సెలింగ్‌లో సుమారు 40 మంది ఎఎన్ఎంలకు పోస్టింగ్ ప్రాంతాల్లో అన్యాయం జరిగినట్లు వైద్య ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. జిడినెల్లూరు విజయం పిహెచ్‌సిలో ఖాళీ వుండగా కౌన్సెలింగ్‌కు హాజరైన ఓ ఎఎన్ఎంకు ఆ ఖాళీ చూపకుండా వి.కోట మండలం ఒగు పిహెచ్‌సి, శాంతిపురం పిహెచ్‌సిలు మాత్రమే ఖాళీగా వున్నట్లు ఈ రెండింటిలో ఏదేని ఒకటి కోరుకోవాలని చెప్పారు. అయితే ఆపై కౌన్సెలింగ్‌కు హాజరైన ఎఎన్ఎంకు జిడినెల్లూరు విజయం పిహెచ్‌సి ఖాళీ చూపారు. అంటే విజయం పిహెచ్‌సి ఖాళీని వీరు ఆ పోస్టును ఇప్పిస్తామని మాట ఇచ్చి వారి నుండి డబ్బులు తీసుకుని మిగిలిన వారికి చూపలేదని తెలుస్తోంది. మరో ఎఎన్ఎంకు సైతం చిత్తూరు పరిసరాల్లో ఎక్కడా ఖాళీలు లేవని వి.కోట మండలం ఒగు పిహెచ్‌సి, గుడుపల్లి పిహెచ్‌సిలో ఖాళీ వుందని చెప్పి ఆమె వెనుక వెళ్ళిన వారికి జిడినెల్లూరు మండలం తూంగుంద్రం పిహెచ్‌సి ఖాళీ చూపించారు. అంటే తూంగుంద్రం పిహెచ్‌సి పోస్టింగ్ ఇప్పిస్తామని చెప్పి వారి నుండి డబ్బులు తీసుకుని వారు వచ్చినపుడు మాత్రమే ఈ ఖాళీ వుండేలా చేశారని తెలుస్తోంది. ఇలా సుమారు 30 నుండి 40 మంది ఎఎన్ఎంలకు ఈ పదోన్నతుల కౌన్సెలింగ్‌లో తీరని అన్యాయం జరిగిందని వాపోతున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వేదికపై వుండి పర్యవేక్షిస్తున్నప్పటికీ వారికి అసలు వ్యవహారం తెలియనివ్వకుండా వారి చెవిలో పక్కాగా పువ్వులు పెట్టి వైద్య ఆరగ్యోశాఖ కార్యాలయ సిబ్బంది తమకు అవసరం వున్న వారికి అవసరం అయిన ప్రదేశాల్లో పోస్టింగ్స్ ఇప్పించుకున్నారని వైద్యశాఖ కార్యాలయంలోని అధికారులే పేర్కొంటున్నారు. పదోన్నతుల కౌన్సెలింగ్‌లో అక్రమాలు వెలుగు చూస్తుండటంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘ నాయకులు మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి జరిగిన విషయాలపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. ఈ విషయంపై కలెక్టర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి వుంది.

# స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**- పసుపు దండు ఆందోళనతో హడలెత్తిన ఫ్యాక్టరీల యాజమాన్యం - ఎమ్మెల్యే పిలుపుతో కదం తొక్కిన తెలుగు తమ్ముళ్లు**

చిల్లకూరు,ఏప్రిల్ 11 ప్రభాతవార్త : మండలంలోని తమ్మినపట్నంలో కోట్ల రూపాయలతో స్థాపించిన జిందాల్ పవర్ ప్లాంట్‌లో స్థానిక యువతీ యువకు లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అలాగే ప్రస్తుతం ఉన్న స్థానిక ఉద్యోగులను తొలగించాలనే ఆలోచన విరమించుకోవాలని గూడూరు నియోజకవర్గం శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం శాసన సభ్యులు, స్థానిక నిరుద్యోగ యువత మరియు టీడీపీ నాయుకులు, కార్యకర్తలతో కలిసి జిందాల్ పవర్ ప్లాంట్ వద్ద శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పిలుపుతో గూడూరు నియోజకవర్గం వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్ల తమ్మినపట్నం పవర్ ప్లాంట్ వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిందాల్ పవర్ ప్లాంట్ లో 75 శాతం స్థానిక యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను, గత ప్రభుత్వంలో చేర్చుకున్న వారిని ఇప్పుడు విధులకు రావద్దని వారిపైన ఒత్తిడి తేవడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పించడం సరైందని కాదన్నారు. స్థానికులు పొలాలు పోగొట్టుకొని జిందాల్ పవర్ ప్లాంట్ కు, ఇతర కంపెనీలకు ఇస్తే వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా బయట వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వడం చాలా దారుణమన్నారు. పొలాలు కంపెనీకి ఇచ్చే సమయంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి, తీరా కంపెనీలో ఉత్పత్తి ప్రారంభించాక, ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. స్థానిక యువతి యువకులకు జిందాల్ పవన్ ప్లాంట్ ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక నిరుద్యోగ యువతి యువ కులతో కలిసి టిడిపి పెద్ద ఎత్తున ఆందోళన పోరా టాలను చేపడతామని వారు హెచ్చరించారు. ఈ ప్రాంతాల్లోని యువత డిగ్రీ, బి టెక్, ఎంబిఏ వంటి పెద్ద చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్నారు, అలాంటి వారికీ జిందాల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. మా అధినేత సియం చంద్రబాబు నాయుడు కూడ ఫ్యాక్టరిలకు భూములు ఇచ్చిన కుటుంబాలకు ఖచ్చితంగా ఫ్యాక్టరిలల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు ఇవ్వాలని చెప్పి ఉన్నారు. చిల్లకూరు మండలం టిడిపి అధ్యక్షులు ఉచ్చురు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు దశరద రామిరెడ్డి,షేక్ జాలిల్ అహ్మద్,పట్టాభి రామీరెడ్డి, మట్టం శ్రావణి, గుండాల శ్రీదేవి కుండాల లీలావతి, టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర్ల రాజు, దువ్వూరు మధుసూధన్‌రెడ్డి, పులిమి శివకుమార్, నెల్లబల్లి భాస్కర్‌రెడ్డి, శివకుమార్, నువ్వు రాజశేఖర్‌రెడ్డి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఏదనపతి భాస్కర్ రెడ్డి ఒడూరు సత్యనారాయణరెడ్డి బిల్లు చెంచురామయ్య, స్థానిక టిడిపి నాయుకులు, కార్యకర్తలు, స్థానిక యువత, మహిళలలు తదితరులు ఉన్నారు.



జిందాల్ పవర్ ప్లాంట్ వద్ద స్థానికులకు ఉద్యోగ ఇవ్వాలంటూ నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే

# సంస్కృత భాష పరిరక్షణలో వర్సిటీ బేష్

**-కంచి కామకోటి పీఠాధితులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి**



తిరుపతి విద్య, ఏప్రిల్ 11 ప్రభాత వార్త : జాతీయ సంస్కృత వర్సిటీ సంస్కృత భాష, సనాతన ధర్మ పరిరక్షణలో కీలక పాత్ర పోషించడం అభినందనీయమని కంచి కామకోటి పీఠాధితులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ సంస్కృత వర్సిటీని సందర్శించిన ఆయన నైమిశా గురుకులంలో విశ్వనాథ ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భారతీయ శాస్త్ర జ్ఞాన సంపదను అందిస్తూ, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించి ఉత్తమ పౌరులుగా వర్సిటీ తీర్చిదిద్దడం సంతోషించదగ్గ విషయమన్నారు. విశ్వనాథుని అనుగ్రహం వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందిపైన, విద్యార్థులపై ఉండాలని ఆకాంక్షించారు.వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత భాష పరిరక్షణకు వర్సిటీ కృషి చేస్తోందని, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మపరిరక్షణకు మరింత కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్ రజినీకాంత్ శుక్లా,ప్రొఫెసర్ ఎస్ దక్షిణామూర్తి శర్మ, రిజిస్ట్రార్ వెంకటనారాయణ రావు, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాధా గోవిందు త్రిపాఠి, డాక్టర్ శాంబశివమూర్తి, పీఆర్ ప్రొఫెసర్ రమేష్ బాబు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాప్రకాశానందగిరి స్వామి...

# పాలరాతి విగ్రహానికి శతశంఖాభిషేకం



శత శంఖాభిషేకాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : స్వర్ణముఖీతీరాన వెలసిన శుకబ్రహ్మాశ్రమంలో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తుంది. శుక్రవారం నుంచి ఆశ్రమంలో ధార్మిక కార్యక్రమాలు, ఆశ్రమ పీఠాధిపతుల ప్రసంగాలు ఏర్పాటు చేసారు. శుక్రవారం సభను పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి ధార్మిక ఉపన్యాసంతో శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలో స్వర్ణముఖి తీరాన వెలసిన దివ్య ఆశ్రమం శుకబ్రహ్మాశ్రమం. ఈ ఆశ్రమ వ్యవస్థాపకులు సుమారు 30సంవత్సరాల పాటు ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాల్ని నిర్వహించారు. అంతేకాక విద్యాప్రకాశానందగిరి స్వామి ఆశ్రమాన్ని స్థాపించటమే కాకుండా గీతకు సరికొత్త నిర్వచనంగా పండిత పామరులకుఅ ర్థమయ్యే రీతిలో 'గీతామకరందాన్ని' అన్ని భాషల్లో ముద్రించి తన ముద్రను వేసుకున్నారు. అంతేకాక దేశ వ్యాప్తంగా గీతాయజ్ఞానలను నిర్వహించి ఆశ్రమ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేశారు. వాడుక భాషలో ప్రసంగాలు లక్షలాది మందిని ఆకట్టుకున్నాయి. ఆశ్రమానికి భక్తులుగా మార్చారు. జీవితసత్యాన్ని ఎంతో చక్కగా వివరించే ఆశ్రమ వ్యవస్థాపకులు ఏర్పేడు ఆశ్రమ వ్యవస్థాపకులు మలయాళ స్వామి శిష్యుల్లో ఒకరు. ఆయన స్థాపించిన శుకబ్రహ్మాశ్రమంలో అన్ని వసతులతో పాటు కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేసిన సామాన్య జనాలకు కంటి చూపును ప్రసాదించటంలో విజయం సాధించారు. ఆయన శిష్య పరంపరలో ఒకరైన విద్యాస్వరూపానందగిరి స్వామి సుమారు 25 సంవత్సరాల పాటు ఆశ్రమాన్ని కంటికి రెప్పలా కాపాడారు.ఆయన 90వ దశకంలో ఆశ్రమ బాధ్యతల్ని సమర్థులైన, సంపూర్ణానందగిరి స్వామికి అప్పగించారు. ఆయన సారథ్యంలో శుక్రవారం నాటి కార్యక్రమాలు నిర్వహించారు.

**పాలరాతి విగ్రహానికి షోడషాభిషేకాలు:**

ఆశ్రమంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవం విద్యా ప్రకాశానందగిరి స్వామి జన్మదిన సందర్భంగా పాలరాతి విగ్రహానికి శుక్రవారం మొదట పీఠాధిపతులు విద్యాస్వరూపానందగిరి స్వామి, పీఠాధిపతి సంపూర్ణా నందగిరి స్వామిల పర్యవేక్షణలో నిర్వహించారు. మొదట సంకల్ప పూజలను నిర్వహించారు. తరువాత స్వామి పాలరాతి విగ్రహానికి షోడషాభిషేకాలు నిర్వహించారు. సకల లోక కళ్యాణం కోసమే ఆశ్రమంలో పూజలునిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి వివరించారు.ఆధ్మాత్మిక చింతనను పెంపొందించటానికి ఆశ్రమం స్థాపించిన ఘనత విద్యాప్రకాశానందగిరి స్వామిది అన్నారు. సద్గురు విద్యాప్రకాశానందగిరిస్వామి జన్మదిన సందర్భంగా గురుపూజోత్సవంగా నిర్వహించినట్లు తెలిపారు. 112వ జన్మదిన సందర్భంగా అష్టోత్తర శత శంఖ కలాభిషేకాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంపూర్ణానందగిరి స్వామి సారథ్యంలో పాలరాతి విగ్రహం వేద మంత్రాలను పఠిస్తూ పూజలు నిర్వహించారు.స్వామి విగ్రహానికి విశేషపుష్ప లంకారాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో విద్యా స్వరూపానందగిరి స్వామి, సంపూర్ణానందగిరి స్వామి, ఆశ్రమానికి చెందిన బ్రహ్మచారి విజయానంద స్వామి, ఈశ్వరస్వామిలు పాల్గొన్నారు.

# సకల దేవతాస్వరూపాలపై...రాజకీయ రగడ !

**-ఎస్వీగోశాలలో గోవులకు ఆపదేనా!? -ఆరోగ్యంగా ఉన్నాయంటూ టిటిడి ప్రకటన**

ప్రభాతవార్త-తిరుపతి:



హిందూ సనాతనధర్మంలో గోమాతను సకలదేవతాస్వరూపులుగా భావించి పూజిస్తుంటారు. అంతటి పవిత్రమైన గోమాతలను ధార్మికసంస్థ టిటిడి ప్రత్యేక శ్రద్ధలతో, వాటి సంరక్షణను కంటికిరెప్పలా పర్య వేక్షిస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా ఎస్వీగో సంరక్షణ ట్రస్ట్‌ను కూడా టిటిడి అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ ట్రస్ట్‌ద్వారా వచ్చే ఆదాయంతో ఎస్వీగోశాలలో గోవులకు అవసరమైన గడ్డి, దాణాకు వినియో గిస్తున్నారు. తిరుపతిలోని గోశాల ప్రాంగణంలోనే దాణా తయారీ యంత్రాలు కూడా ఉన్నాయి. పైగా మేతకూడా లోటులేకుండా చూస్తుంటారు. ప్రత్యేకంగా గోశాల పర్యవేక్షణ తిరుపతి జెఇఒ ఆధ్వర్యంలో ఉంటుంది. గోవుల పేడ,పంచతంతో పంచగవ్య ఉత్పత్తులు తయారుచేస్తోంది. వీటికి భక్తుల నుండి విశేష ఆదరణ ఉంది. ఇదివరకు టిటిడి చరిత్రలో ఎన్నడూ లేనిరీతిలో ఒక్కసారిగా టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయని వైసిపి నేత, మాజీ టిటిడిఛైర్మన్ మీడియా సమావేశం నిర్వహించి మరీ వెల్లడించడం ఇప్పుడు సంచలనంగా మారింది. అంతేగాక భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కావడంతో గోవులు మృతి ఘటన కలకలం రేపుతోంది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్నఫళంగా ఆయన చేసిన ప్రకటన ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. గోవులు దేవునితో సమానమని, ఎస్వీగోశాలల గోవులు దారుణంగా చనిపోతున్నాయని భూమన వెల్లడించడం ,వాటి బాగోగులు పట్టించుకోకపోవడం దుస్థితి దారుణంగా ఉందని ఆరోపించారు.ఎస్వీగోశాల నుండి తిరుమలకు పాలు సరఫరా అవుతుందని ,గత వైసిపి పాలనలో గుజరాత్, రాజస్థాన్ ఇతర రాష్ట్రాల నుండి ఆవులును తీసుకువచ్చి వాటి పాలు తీసుకుంటున్నారని అన్నారు. మూడునెలల్లో వంద ఆవులు మరణించాయని ఆయన ప్రకటన వెనుక అంతర్థానం ఏమిటనేది ఇప్పుడు టిటిడి కూడా పునరాలోచనలో పడింది. ఇదిలా ఉండగా ఇదే అంశంపై టిటిడి బోర్డు సభ్యుడు, బిజెపి నేత భానుప్రకాశ్‌రెడ్డి మీడియా ముందుకు వచ్చాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడటం కరుణాకర్‌రెడ్డికి తగదన్నారు. గోశాల పరిశీలనకు రావాలని భూమనకు సవాల్ విసిరారు.

**-ఆ ఆవులు టిటిడి గోశాల కాదు:**

గోశాలలో ఆవులు ఆరోగ్యంగానే ఉన్నాయని టిటిడి ప్రకటించింది. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో కావాలనే పనిగట్టుకుని టిటిడిపై, కూటమి ప్రభుత్వ పాలనపై వదంతులు సృష్టిస్తున్నారని టిటిడి ప్రకటించింది. మృతి చెందిన ఆవుల ఫోటోలు టిటిడి గోశాలకు చెందినవి కాదని స్పష్టం చేసింది. అవాస్తవాలను భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# సర్వశుభాలు కలగాలని కటాక్షిస్తూ... స్వర్ణ రథంపై మలయప్ప



తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి: శ్రీనివాసుడి ఉత్సవ మూర్తులు వేసవి తాపం నుండి ఉపశమనానికి జరిపిస్తున్న వసంతోత్సవాల్లో రెండవరోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేతుడై మలయప్పస్వామి బంగారురథంపై భక్తులను కటాక్షించారు. బంగారురథంపై ఉభయదేవేరులతో కలసి భక్తులకు దర్శనమిచ్చాడు. మలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవింద నామంతో పునీతులయ్యారు. స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు.

# చట్టం తన పని, తాను చేసుకుంటూ పోతుంది

**డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు**

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 11 ప్రభాతవార్త : ఉమ్మడి ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని ఇక్కడ కక్షసాధింపులు వేధింపులు ఉండవని డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు అన్నారు. శుక్రవారం ఆయన పంచభూత లింగాల్లో వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో తన తనయుని పుట్టిన రోజు సందర్భంగా పూజలు జరిపించుకున్నారు. తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజా స్వామ్యబద్ధంగా పరిపాలన సాగుతుందన్నారు. ఎవరో ఏమో చేసారని వారి మీద కక్షసాధింపులు ఉండవన్నారు. మమ్ముల్ని వేధించి, కక్షసాధింపు చర్యలుగా హింసించి,జైల్లో వేసిన సంఘటనలు మరచిపోలేదని అయితే 'చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. ఒక సారి చర్యలు తీసుకుంటే మళ్ళీ తిరుగు ఉండదని రఘురామకృష్ణమరాజు స్పష్టం చేసారు.ఇక అగ్రిగోల్డ్ బాధితుల బాధలను గురించి ప్రశ్నించగా ఒక్క అగ్రిగోల్డ్ ఏమిటి? ఎర్రచందనం, ఇసుక మాఫీయా కేసులో మాజీ మంత్రి సునీల్ కుమార్ చాలా మంది బినామి పేర్లు మీద డ్రా చేసారు. ఎర్ర చందనం ఆయన హయాంలో మాయమైనట్లు శాటిలైట్ రిపోర్టులు న్నాయి. కూటమి ప్రభుత్వం ఏదీ తొందరపాటు చర్యలుండవు, పకడ్బందీగా విచారణ చర్యలు ఉంటాయన్నారు. తనపై అక్రమంగా వ్యవ హారించిన వారిపై తప్ప కుండా చర్యలుంటా యని విశ్వాసంఉంద న్నారు.



**13 సంవత్సరాల నిరీక్షణ తరువాత:**

తాను సుమారు 13సంవత్సరాలక్రితం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించు కున్నాను. అప్పటికి ఇప్పటికి ఎన్నో మార్పులు,చేర్పులు ఉన్నాయన్నారు. ఇక స్వామి వారిని తన తనయుడు జన్మదిన సందర్భంగా దర్శించుకోవటం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు.పరిపాలన సాజావుగా సాగాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శివయ్యను మొరబెట్టుకున్నా నని డెప్యూటీ స్పీకర్ వివరించారు.తనకు దర్శనం ఏర్పాట్లు చేసిన ఇఒ బాపిరెడ్డి, మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోలా ఆనంద్ కుమార్, మాజీ మార్కెటింగ్‌కమిటి ఛైర్మెన్ చెంచయ్య నాయుడు, సుబ్రమణ్యం రెడ్డిలు పాల్గొన్నారు.

## జనారణ్యంలో వచ్చిన జింక



**శాంతిపురం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** ఆహార అన్వేషణలో భాగంగా ఓజింక దారి తప్పి జనారణ్యంలో వచ్చేసింది. దీన్ని చూసి శునకాలు తరమగా భయంతో ఓ ఇంటి వద్దకు చేరగా ఆయన అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి జింకను అప్పగించారు. మండలంలోని దుంకుమానిపల్లి గ్రామంలోకి శుక్రవారం సాయంత్రం ఓ జింక ప్రవేశించింది. శునకాలు వెంటపడగా పరుగులు తీసిన జింకకు గాయాలు కాగా స్థానిక దేశం నేత మురుగన్ నివాసం వద్దకు చేరుకుంది. దీంతో మురుగన్ శునకాలను తరిమేసి అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి జి ంకను స్వాధీనం చేసుకుని చిల్లిమానిపల్లి అటవీ ప్రాంతంలో వదిలేశారు.

## చెడు వ్యసనాలకు యువత, విద్యార్థులు దూరం



**పాలసముద్రం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** టెక్నాలజీ యుగంతో యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా వుండాలని తహసిల్దారు అరుణకుమారి పిలుపునిచ్చారు. తహసిల్దారు కార్యాలయంలో శుక్రవారం తహసిల్దారు అరుణకుమారి మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మత్తు పదర్థాలు, మద్యం విక్రయాలకు అస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిధిలో ఎక్కడా మత్తు పదర్థాలు విక్రయించకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి యువత, విద్యార్థులు చెడు మార్గాల్లో పయనించకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మురళీకృష్ణ, సూపర్‌వైజర్ మురళీ, ఎస్ఐ చిన్నరెడ్డప్ప, రీ-సర్వే డిప్యుటీ తహసిల్దారు జెవి ప్రవీణ్‌కుమార్, విఆర్‌ఓలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## 7 రోజుల్లో భూసమస్యలు పరిష్కారం



**పాలసముద్రం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** భూముల రీ-సర్వేలో భాగంగా రెవెన్యూ సిబ్బంది నుండి నైన్‌టు నోటీసులు అందుకున్న రైతులు తమ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించుకోవాలని తహసిల్దారు అరుణకుమారి పేర్కొన్నారు. మండలంలోని కృష్ణజిమ్మాపురం ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో తహసిల్దారు అరుణకుమారి శుక్రవారం రైతులతో సమావేవం అయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూముల రీ-సర్వేలో కొంతమంది రైతులకు సంబంధించి భూముల కొలతల్లో వ్యత్యాసాలు వచ్చాయని అలాంటి రైతులకు నైన్‌టు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మండల ఆర్ఐ శ్రీదేవి, మండల సర్వేయర్ గణేష్, విఆర్‌ఓలు వెంకటాచలం, శ్రీనివాసులు, తంగరాజ్, రమణయ్య, సర్వేయర్లు మునిరత్నం, హరి, ఆలీ, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## జనారణ్యంలోకి వచ్చిన దుప్పి



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : వేసవిలో దాహార్తిని తీర్చుకోవడం కోసం అటవీ ప్రాంతం నుంచి చాలా దూరం ప్రయాణించి పుంగనూరు పట్టణ పోలిమేరలోకి వచ్చిన చుక్కల జింకను స్థానికులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని రామ్ నగర్ ప్రాంతంలో కొన్ని కుక్కలు ఒక జింకను తరుముతుండగా స్థానికులు గమనించారు. అరుదైన చుక్కలతో ప్రాణభయంతో హడలిపోతున్న జింకను భావజాన్, అక్మల్, దావూద్, భాగ్యమ్మ, కుక్కలు గుంపు నుంచి కాపాడి సంరక్షించారు. అటవీ అధికారులకు ఈ సమాచారం అందివ్వడంతో వారు జింకను స్వాధీనం చేసుకుని సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

## పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి



**పుంగనూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** రెండు దశాబ్దాల క్రితమే భారత దేశంలో నిరక్షరాస్యతను పోగొట్టి పేదల అభ్యున్నతికి పాటుపడిన జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు కోరారు. పూలే జయంతి సందర్భంగా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగిడి గోపాల్‌తో పాటు ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బహుజన పార్టీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది శ్రీనివాసులు, అద్దాల నాగరాజు బిజెపి నాయకులు నర్సింహులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఆర్టీసీ వైస్ చైర్మన్‌కు వినతి



**కుప్పం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఆర్టీసీలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంకు రాష్ట్ర ఎన్ఎంయుఎ అధ్యక్షుడు పివి రమణారెడ్డి రాసిన వినతిపత్రాన్ని శుక్రవారం కుప్పంలో ఎన్ఎంయుఎ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన పరిశీలించి ప్రతి విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి వాటి పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేలు, ఉపాధ్యక్షుడు వాసులు, జిల్లా కార్యదర్శి రెడ్డి, డిపో అధ్యక్ష కార్యదర్శులు స్వామి, జయపాల్, జాయింట్ కార్యదర్శి మునెప్ప, నవీన్, టివి.కుమార్ పాల్గొన్నారు.అంతకుముందుతమ సమస్యల పరిష్కారంకై స్థానిక డిపోలో రెండోరోజూ నిరసన తెలిపారు.

## బిసిల ఆశాజ్యోతి మహాత్మా పూలే : గౌనివారి



**శాంతిపురం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** బిసిల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మహాత్మా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. బిసిల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, మణి, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, గోపాల్, మంజునాథరెడ్డి, మునేగౌడు, శివకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

## రామాలయం నిర్మాణానికి సహకరించాలి

**శాంతిపురం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త** :మండలంలోని కూతేగానిపల్లిలో నిర్మిస్తున్న శ్రీరామాలయం నిర్మాణంకు అందరూ సహకరించాలని గ్రామస్తులు కోరారు. గ్రామస్తులు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో డెబ్భై ఏళ్ల క్రితం గ్రామంలో పెద్దలంతా కలసి ఆలయ నిర్మాణంకు తోచిన విధంగా చందాలు వసూలు చేసి ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టారని అయితే పైకప్పు వరకు వచ్చి నిర్మాణం ఆగిందన్నారు. కాగా రామాలయంకు సమీపంలో గంగమ్మ ఆలయం ఉండడంతో జ్యోతిష్యుల సలహా మేరకు గంగమ్మ ఆలయాని ్న మరో చోటకు మార్చి గ్రామస్తులు మరో రైతును ఒప్పించి అతని భూమిలో శ్రీరామాలయం నిర్మించడం జరుగుతోందన్నారు. అయితే కొంతమంది రామాలయం నిర్మిస్తున్న ప్రాంతంలో కొంత భూమికి సంబంధించి తమకు పట్టా ఉందని పేర్కొంటున్నారని వారు కూడా ఆలయ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ భూమి

## విద్యార్థికి పారితోషకం అందిస్తాం

**వెదురుకుప్పం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షలలో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ప్రోత్సహ నగదు అందజేయడం జరుగుతుందని మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బోడి రెడ్డి అశోక్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫలితాలలో మండల స్థాయిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి పది వేల రూపాయాలు నగదు అందించడం జరుగుతుందని ప్రకటించారు. అత్యధికమార్కులుపొందినవిద్యార్థికి మండల విద్యాశాఖాధికారి చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు.

## పేడ దిబ్బలు తొలగింపు మన అందరి బాధ్యత



**పూతలపట్టు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోలవరం, పూతలపట్టు, పి.కొత్తకోట,చిట్టిపీరాల వావిల్‌తోట పాటూరుపేట అగ్రహారం పరిధిలోని పేడ దిబ్బలను తొలగింపు కార్యక్రమంని ఈవోపీఆర్డి శ్రీనివాసులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం నివసిస్తున్న ప్రాంతాలలో పేడ దిబ్బలు పెరిగిపోవడం ఒక పెద్ద సమస్యగా మారిందని ఇది కేవలం మన కళ్ళకు అసహ్యంగా కనిపించడమే కాకుండా మన ఆరోగ్యాన్నికి పర్యావరణం, భూమిని కలుషితం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు ప్రజలు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో కార్పోరేట్ స్థాయి విద్యాబోధన

– ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో కార్పోరేట్ స్థాయి విద్యాబోధనకు సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల జీవితంలో డిగ్రీ ఎంతో కీలకమైందన్నారు. డిగ్రీ అనంతరం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటే తమ కాళ్లపై తాము నిలబడేఅవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కుప్పంను విద్యాకేంద్రంగా చేయాలనేది సిఎం చంద్రబాబు ఆశయమన్నారు. అందులో భాగంగానే గ్రామగ్రామాన ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లు, మండలానికో జూనియర్ కాలేజ్ ఏర్పాటుచేశారన్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



**కుప్పం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** మండలంలోని చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లికి చెందిన కుమరేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇతని వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద లక్ష రూపాయలు మంజూరయ్యాయి. ఈచెక్కును శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ బాధిత కుటుంబానికి అందజేశారు. పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, తెలుగుయువత రాష్ట్ర నేత చెక్కునత్తం మణి, బిసి సెల్ అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

## బడుగుల ఆత్మబంధువు మహాత్మా జ్యోతిరావ్ పూలే

– ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** బడుగుల ఆత్మబంధువు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో పూలే 198వ జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి వారు పూజలు నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంటరానితనం, కులవివక్ష నిర్మూలన, స్త్రీ విద్యకోసం పోరాడిన సంఘ సంస్కర్త పూలే అని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, రాష్ట్ర నేత జిఎం రాజు, మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, బిసి సెల్ అధ్యక్షుడు మురళి, తెలుగుయువత రాష్ట్ర నేత చెక్కునత్తం మణి, కౌన్సిలర్ సోమశేఖర్, జనసేన నరేష్, నేతలు రామచంద్ర, మంజు, సతీష్, వసంతమ్మ, శ్యాంసుందర్, వాటర్ గిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గాంధీ విగ్రహం వద్ద పూలే చిత్రపటానికి నేతలు పివి ఉపేంద్రకుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్, మండల అధ్యక్షుడు వడివేలు తదితరులు నివాళులు అర్పించారు.

**సామగుట్టపల్లిలో:** కుప్పం మున్సిపల్ సామగుట్టపల్లి యుపి స్కూల్‌లో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని హెచ్ఎం దీనదయాళ్ అధ్వర్యంలో నిర్వహించారు. ఎంఇఒ 2 రాజారాం, ఉపాధ్యాయులు గాలి సురేష్ తదితరులు పూలే చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సౌజన్య, భువనేశ్వరి, గాయత్రి, శాంత, విజయనిర్మల, సరస్వతి పాల్గొన్నారు.

**రామకుప్పం :** రామకుప్పం తెదేపా కార్యాలయంలో పూలే జయంతిని దేశం నేతలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూజలు జరిపి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతలు మునసా ్వమి, ఆనందరెడ్డి, నరసింహులు, రామూర్తి, ఆంజనేయరెడ్డి, జయశంకర్, రఫీ, మనోహర్, విజయకుమార్‌రెడ్డి, వెంకటాచలం, ఆదిల్, రామలింగారెడ్డి, అవినాష్, అల్లిశీన, పద్మనాభం పాల్గొన్నారు

## కృష్ణాపురం-అడవిబూదుగూరుకు కొత్త రోడ్డు



**కుప్పంరూరల్, ఏప్రిల్ 11ప్రభాతవార్త:** మండలంలోని మల్లానూరు పంచాయతీ కృష్ణాపురం నుంచి అడవిబూదుగూరు వరకు కొత్త లింక్ రోడ్డు నిర్మాణంకు సిఎం చంద్రబాబునాయుడు 19లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో శుక్రవారం మండల టిడిపి అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ నూతన రోడ్డు నిర్మాణంకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కుప్పం అభివృద్ధికి సిఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు రమేష్, దామోదర్, నాగార్జున, అశోక్, అన్నాదొరై, రాజ్‌కుమార్, ప్రకాష్, విభూషణ్, సాము, వెంకటప్ప, రాజు, జయప్రకాష్ పాల్గొన్నారు.

## శ్రీపెద్దపల్లి గంగమ్మ ఆలయంలో అన్నదానం



**కుప్పంరూరల్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** కుప్పం కొత్తపేటలో వెలసిన శ్రీ పెద్దపల్లి గంగమ్మ జాతరను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి ఉత్సవాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద భక్తులకు ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి వెంకటేష్‌లు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 19న అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 20న అమ్మవారికి మహిళల పొంగళ్ల సమర్పణతో జాతర ముగుస్తుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జ్యోతిబాపూలే స్ఫూర్తితో అన్ని రంగాల్లో మహిళలు రాణింపు

– బీసీలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
– జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌లు



**చిత్తూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** జ్యోతిబా పూలే స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ముందుకు వెళ్తున్నారని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు పేర్కొన్నారు. చిత్తూరు బీసీ సంక్షేమభవన్‌లో శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సంఘం ఆధ్వర్య ంలో జ్యోతిబాపూలే 199వ జయతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, బీసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, బిసి సంక్షేమశాఖ డిడి మునేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం, అట్లూరి శ్రీనివాసులు, రవి, చోడప్ప, నాగరాజు, భరత్, రవిరాజు, ఈశ్వర్, బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

***రూ.11.58 కోట్ల మెగా చెక్కు అందజేత:***

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు అయిన 535 మంది లబ్ధిదారులకు శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, మేయర్ అముదలు 11.58 కోట్ల రూపాయల మెగా చెక్కును అందజేశారు.

## బిసీల అభివృద్ధికి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక : కలెక్టర్



**చిత్తూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ప్రభుత్వం పక్కాగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించి అమలు చేయడానికి సిద్ధంగా వుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే 199 జయంతి పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరు గాంధీ విగ్రహం కూడలిలో వున్న జ్యోతిబాపూలే విగ్రహానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మహాత్మా జ్యోతిబాపూలే ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, ఇన్‌ఛార్జీ బీసీ సంక్షేమ అధికారి మునేంద్రయ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, బీసీ సంఘాల నాయకులు షణ్ముగం, అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్య రాణిస్తుంది



**చౌడేపల్లి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** క్రమశిక్షణతో కూడిన విద్య రాణిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయప్రకాష్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రలో భాగంగా కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత రాత పుస్తకాలందించారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు బాలాజీ, సుబ్బయ్య, యశోదమ్మ, సుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## జంగమయ్యగారిపల్లిలో అగ్నిప్రమాదం



**చౌడేపల్లి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** మండలంలోని కాగతి పంచాయతీ జంగమయ్యగారిపల్లిలో శుక్రవారం జరిగిన సంభవించిన అగ్నిప్రమాదలో రూ. 20వేలు ఆస్థినష్టం వాటిళ్ళింది. పుంగనూరు అగ్నిమాపక కేంద్రం అధికారి సుబ్బరాజు కథనం మేరకు... జంగమయ్యగారిపల్లి సతీష్‌కు మామిడితోటకు వేసిన కంచెకు నిప్పంటుకుంది. సమాచారమందుకొన్న అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి గ్రామస్తుల సహకారంతో మంటలను పూర్తిగా అదుపు చేసారు. ఈ ప్రమాదంలో 10చింతచెట్లు కాలిపోయి రూ.20వేల వరకు ఆస్థినష్టం సంభవించిందని సుబ్బరాజు తెలిపారు. గుర్తు తెలియని ఆకతాయిలు ధూమపానం సేవించి బీడీ ముక్కలను పడే వల్లనే ప్రమాదం వాటిల్లిందని ఆయన వివరించారు.

## ఆరోగ్యంపై అవగాహన కల్గి వుండాలి



**చౌడేపల్లి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** ఆరోగ్యం పట్ల విద్యార్థులు అవగాహన కల్గి వుండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. పట్టణంలోగల 3వసతి గృహాలను ఆయన సందర్శించారు. పారిశుద్యం, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వేసివిలో తీసుకోవాల్సి న జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. ఆరోగ్య సూపర్ వైజర్ బాహుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ బలోపేతంకు కృషి చేద్దాం



**వెదురుకుప్పం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** రానున్న స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలోపేతంకు క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషియాలని జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీష్ నాయుడు పిలుపు నిచ్చారు. మండలంలోని తిరుమలయ్యపల్లెలో శుక్రవారం మండల ఆ పార్టీ అధ్యక్షులు బోడిరెడ్డి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియాజేసి పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జీ రాజేంద్రన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోడిరెడ్డి హనుమంతరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సోమశేఖర్‌రాజు, కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరెడ్డి, రాజేంద్రరెడ్డి, సీనియర్ నాయకులు చెంగా రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు శేఖర్, యువ మోర్చా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలాజీరెడ్డి, సోషియలల్ మీడియా ఇన్‌చార్జీ గుణశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సి అదనపు భవన నిర్మాణంకు భూమిపూజ



**రామకుప్పం, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** మండలంలోని విజలాపురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు అనుబంధంగా అదనపు భవన నిర్మాణానికి దేశం నేతలు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నేతలు మునసా ్వమి, ఆనందరెడ్డి, నరసింహులు, ఎంపిపి సులోచన, వైస్ ఎంపిపి వెంకట్రామ గౌడు, రామూర్తి, మనోహర్, శ్రీనివాసులురెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా నవమి పూజలు



**తిరుపతి,ఏప్రిల్ 11ప్రభాతవార్త:** తిరుపతి పెద్దకాపువీధిలోని పురాతన రామాలయంలో 11రోజుల శ్రీరామనవమి వేడుకలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం భజనమందిరంలో రామనామ సంకీర్తనలు ఆలపించి భజనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, కెఎన్ రాజా, అక్కినపల్లి మునికృష్ణయ్య, మురళి, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, లీలావతి, ప్రభావతి, సుభద్రమ్మ, జయమ్మ, కళాకారులు పాల్గొన్నారు.

## ఆగమోక్తంగా వసంతోత్సవం



తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి ఉత్సవమూర్తులకు రెండవరోజు శుక్రవారం ఉదయం శ్రీదేవిభూదేవి సమేత ీమలయప్పస్వామికి స్నపన తిరుమంజనం ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## నేడు డ్రామా జూనియర్స్‌సీజన్ 8

**తిరుపతి,ఏప్రిల్ 11ప్రభాతవార్త:** తెలుగుప్రేక్షకులకు సరికొత్త కార్యక్రమాలను అందిస్తూ వినోదం పంచుతున్న జీతెలుగులో శనివారం రాత్రికి డ్రామా జూనియర్స్ సీజన్ 8 ప్రారంభమవుతుంది. రాత్రి 9గంటలకు ఈ ప్రసారం జరుగుతుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు.ఇప్పటికే 7సీజన్లు పూర్తిచేసుకుని, 8వ సీజన్‌తో ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైంది.ప్రతిశనివారం రాత్రి 9గంటలకు కడుపుబ్బనవ్వించే కామెడీ పంచులుతో అలరించనుందన్నారు.

## తొలిరోజు ప్రశాంతంగా తుంబురుతీర్థ స్నానాలు




**తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం కొండల్లోని పవిత్రతీర్థాలలో తుంబురుతీర్థముక్కోటికి ఎంతో విశిష్టత ఉంది. ఈ తీర్థానికి వెళ్ళే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. తొలిరోజు శుక్రవారం ఉదయం 5గంటల నుండి 10గంటల వరకు భక్తులను అనుమతి నించారు.వీరికి దారిపొడవునా ఎలాంటి అసౌకర్యం కలగ ీకుండా సకల సౌకర్యాలు కల్పించారు. పోలీసు, అట వీశాఖ, టిటిడి విజిలెన్స్, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పానవినాశనం నుండి తుంబురు తీర్థం వరకుఅక్కడక్కడా భద్రతా సిబ్బంది ఉండి సేవలందించారు.

## శ్రీవారిసేవలో... డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు



తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి: అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణమరాజు శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనతో బాటు చిత్తూరు ఎంఎల్ఎ గురజాల జగన్‌మోహన్ ఉన్నారు.

## సంస్కృత వర్సిటీలో ఘనంగా పూలే జయంతి



**తిరుపతి విద్య, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** జాతీయ సంస్కృత వర్సిటీలోని కౌన్సిల్ హాల్ నందు శుక్రవారం సంఘసంస్కర్త, స్త్రీ విద్యా ఉద్ధారకులు, సామాజిక సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే 198వ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగినది.వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి ఎస్ ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలు అర్పించి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ కె. వెంకటనారాయణ రావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొ.ఎస్. దక్షిణామూర్తి శర్మ, ప్రొ.రాధా గోవింద త్రిపాఠి, ప్రొ.పి.వెంకటరావు, రిజర్వేషన్ సెల్ చైర్ పర్సన్ డా.జె.బి.చక్రవర్తి, ఓబీసీ సెల్ లైసెన్ ఆఫీసర్ ప్రొ.ఎ. సచ్చిదానందమూర్తి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.ఎ.చందూలాల్ పాల్గొన్నారు.

## పూలే గొప్ప విద్యా దర్శనికుడు: విసి



**తిరుపతి విద్య, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** భారత దేశ మొదటి సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న వి సి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ పూలే 19వ శతాబ్దంలో అనేక విప్లవాలకు నాంది పలికారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ పూలేని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ఆదర్శంగా ముందుకు నడవాలని తెలిపారు .డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మాట్లాడుతూ పూలే కుల వివక్ష నిర్మూలన కోసం సమ సమాజ స్థాపన కోసం అవిరాళంగా శ్రమించిన గొప్ప సాంఘిక సంస్కర్తని పూలే చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం త్వరలో భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ యాదవ్, రాజశేఖర్,సంతోష్ ,మహేష్,రమేష్ ,ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయండి

**- సర్వసభ్య సమావేశంలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ**




కోట, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ గోపి ప్రజాప్రతినిధులను కోరారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఎంపిపి దాసరి అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ గోపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆయా గ్రామాల ఆదాయం చూసుకొని ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ కింద 28 శాఖలు ఉన్నాయని, ఆయా శాఖల అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. ఈసారి జరగబోవు సమావేశాలకు ఆయా శాఖల అధికారులు రావాలని, అసిస్టెంట్ అధికారులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎంఇఓ మస్తానయ్య మాట్లాడుతూ మండలంలో 77 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి, 22 మోడల్ స్కూల్స్ ఉన్నాయని వివరించారు. అనంతరం పిఆర్ ఏఇ కిరణ్ మాట్లాడుతూ మండల పరిధిలో రెండు కోట్ల 50 లక్షల మేరకు సిసి రోడ్డు పనులు జరిగాయిన చెప్పారు. అనంతరం సిడిపిఓ అంగన్‌వాడీ కేంద్రాల గురించి, స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశానికి టిడిపి ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు సౌజన్యరెడ్డి, జడ్పిటిసి కోటయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రైతుల పక్షపాతి : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : సీఎం నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని వ్యవసాయం మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని రైతులకు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి మేలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రైతులకు పనిముట్లు, సబ్సిడీ విత్తనాలు వంటివి ఇస్తున్నట్లు చెప్పారు. రైతులు ఆనందంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులకు సాగునీరు, సాగునీరు అందించే ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు మే నెలలో ప్రారంభి స్తామని తెలిపారు. రైతుల కోసం రిజర్వాయర్ పనులను తృతీయతను పూర్తి చేస్తామని తెలిపారు. ఎంపీపీ తనుజ రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రైతులకు ఎలాంటి పనిముట్లు ఇవ్వలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీ నాయుడు, డక్కిలి ఎంపీపీ రాజశేఖర్, ఏడిఏ నాగార్జున సాగర్, ఏవోలు సుజాత, శిరీష, భారతి వరప్రసాద్, ఎంపీడీవోలు గుణశేఖర్‌రెడ్డి, కె.వి కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, నాయకులు విశ్వనాథం, బీరంరాజేశ్వరరావు, సత్యనారాయణ, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అభినందనలు



కోట,ఏప్రిల్ 11 ప్రభాతవార్త :మండలం విద్యానగర్ లోని ఎన్‌బికేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పలు పోటీల్లో విజేతలగా నిలిచినందకు కళాశాల డైరెక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు. సిఎస్‌ఇ విభాగంలో షేక్. అస్మా జబీన్, ఆర్‌ఎస్.ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టెక్నో పల్స్ సదస్సు కోడింగ్ బగ్గింగ్‌లో మొదటి స్థానంలో నిలిచిందని సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అన్నమాచార్య యూనివర్శిటి రాజంపేటలో నిర్వహించిన ఏటూ దేనేషనల్ లెవల్ టెక్ ఫెస్టె ట్రిపుల్ విభాగంలో పి.షాహేల్ ముజీబ్, జశ్వంత్ టీం టెక్ఎక్స్‌పోలో ఇంపాక్టె ఆఫ్ డ్రోన్స్ అన్ అగ్రికల్చర్ అనే అంశంపై ప్రథమ బహుమతి గెలుపొందారు. పేపర్ ప్రెజెంటేషన్‌లో గ్రీష్మ,చార్మిక విజేతలగా నిలిచారు. రిజనరేటివ్ బ్రేకింగ్ ఇన్ ఎలక్ట్రానిక్ వెహికల్స్ అనే అంశం పై కూడా బహుమతులు సాధించారని ఎన్.సురేష్‌రెడ్డి చెప్పారు. తమ విద్యార్థులు అన్ని రంగల్లో చక్కని ప్రతిభ చూపారని డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమలో తులసీరామ్ పాల్గొన్నారు.

## కోటలో జ్యోతిబాపూలే జయంతి

కోట,ఏప్రిల్ 11 ప్రభాతవార్త: మహాత్మజ్యోతిబాపూలే జయంతి వేడుకలను శుక్రవారం కోటలని బిసి గురుకులంలో నిర్వహించారు. ముందుగా జ్యోతి బాపూలే చిత్ర పటానికి ప్రిన్సిపాల్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపల్ సరితలు పూలమాలు వేసి నివాళిర్పించారు. బహుజన నాయకులు మీజారు మాదవ్, పనబాక హేమంత్, పాల మల్లి,ఉపాధ్యాయులు శంకరయ్య, వెంకటరమణయ్య శ్రీనివాసులు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఇలుపూరుపాడులో రీసర్వే ప్రారంభం

కోట, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: మండలం సిద్దవరం పంచాయతీ ఇలుపూరు పాడులో శుక్రవారం తహశీల్దార్ జయజయరావు ఆధ్వర్యంలో రీసర్వే ప్రారంభించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీసర్వే అమలు చేస్తుందని చెప్పారు. సర్వే చేస్తున్న సమయంలో గ్రామ రైతులు సర్వేయర్లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలసర్వేయర్ గోపీనాథ్‌రెడ్డి, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## ఘనంగా గోకులకృష్ణ ఫార్మశీ ఫెస్ట్



సూళ్లూరుపేట, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : గోకులకృష్ణ ఫార్మశీ కళాశాలలో శుక్రవారం ఫార్మశీ ఫెస్ట్ 2025ను ఘనంగా నిర్వహిం చారు. కళాశాల కార్యదర్శి శ్రీనివాసబాబా, కోశాధికారి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండ య్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫార్మ రంగం పట్ల విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 27 మంది విద్యార్థులకు మెడల్స్ బహూకరించారు. అనంతరం విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్, అకడమిక్ అడ్వైజర్ రమేష్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, గుర్రం మనోహర్, ఫార్మశీ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెగా అభిమానులచే రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: మెగాస్టార్ చిరంజీవి అభిమాన సంఘం వారిచే శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించారు. మెగా స్టార్ చిరంజీవి అందజేసిన సేవాస్ఫూర్తితో తాము రక్తదానం చేపడుతున్నట్లు మెగాస్టార్ చిరంజీవి సేవాసంఘానికి చెందిన హేమంత్‌కుమార్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో లీలామోహన్, సుమన్, రెడ్‌క్రాస్ మోటివేటర్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రాంకుమార్‌రెడ్డికి అభినందించినలు తెలిపిన సజ్జల



వెంకటగిరి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయే విధంగా చేసిన వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జన రామకృష్ణారెడ్డి అభినందన తెలిపారు. తాడేపల్లిలోని సజ్జల రామకృష్ణారెడ్డి నివాస గృహంలో రామ్‌కుమార్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అవిశ్వాస తీర్మానంపై వివరించారు. రాష్ట్రాల్లో మొట్టమొదట చైర్‌పర్సన్‌పై అధికారపార్టీ వారు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని రాంకుమార్‌రెడ్డి ఆయనకు వివరించారు. రాంకుమార్‌రెడ్డిని సజ్జల అభినందనలు తెలిపారు.

## ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి



గూడూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: గూడూరు రైల్వే స్టేషన్‌లో ఆటో డ్రైవర్‌లకు, గంజాయి మరియు ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు సంబంధించి, ఆటో డ్రైవర్‌లకు గూడూరు ఆర్.పి. ఎఫ్ ఏ.ఎస్.ఐ జి.ప్రభాకర్ కీలక అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో కార్యక్రమాన్ని రైల్వే స్టేషన్ ఆవరణలో నిర్వహిం చారు. ఆటో డ్రైవర్లు బాధ్యతగా మర్యాదపూర్వక ప్రవర్తనను, రూపొందిం చుకోవాలని, రైళ్లలో అక్రమంగా సరుకు రవాణా చేయడం, ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం. స్టేషన్‌లో, అనధికార పొట్లాలను తీసుకెళ్లడం లేదా, రైళ్ల ద్వారా వస్తువులను అక్రమంగా రవాణా చేయడంలో ఇతరులకు సహాయం చేయడం వంటి చట్టవిరుద్ధమైన రవాణా కార్యకలాపాలతో సంబంధం ఉన్న నష్టాలను, పరిణామాల గురించి డ్రైవర్‌లకు తెలియజేయడం జరిగింది. ప్రజల అవగాహనను మెరుగుపరచడం మరియు ప్రయాణీకులకు, ముఖ్యంగా పర్యాటకులకు, వృద్ధులకు మరియు ప్రాంతం గురించి తెలియని వారికి మెరుగైన సేవలను అందించడంపై దృష్టి సారించాలని, రైల్వే స్టేషన్‌లో మరింత సురక్షితమైన మరియు ప్రయాణీకులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, రైల్వే స్టేషన్ కార్యకలాపాలకు మరియు ప్రజల సంతృప్తికి సానుకూలంగా దోహదపడుతుందని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.పి.ఎఫ్ సిబ్బంది, మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఉర్దూ స్కూల్ విలీనాన్ని ఆపండి

చిల్లకూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఇతర పాఠశాలలో విలీన ప్రక్రియను నిలిపివేయాలని పట్టణ ముస్లిం మైనారిటీలు శుక్రవారం ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు ఎండీ. అబ్దుల్ రహీం, జమాలుల్లా, ఖమ్రుల్ ఇస్లాం, షబ్బీర్ ఎమ్మెల్యే దృష్టికి సమస్య తీసుకెళ్లారు. 75 ఏళ్లకు పైగా ఉర్దూ స్కూల్‌లో ముస్లిం విద్యార్థులు ఉర్దూ భాషను నేర్చుకుని ఉన్నతంగా ఎదిగిన చరిత్ర ఉందన్నారు. అటువంటి స్కూల్‌ను విలీనం చేసి ఉర్దూ భాషను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటుండడం సరికాదన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉర్దూ భాష కొనసాగేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. దీంతో మైనారిటీలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనారిటీలు షఫీ మోలానా, ఎండీ. అబ్దుల్ రహీం, నాజర్ భాయ్, అలీ హుస్సేన్ భాయ్, అబ్రార్, జమాలుల్లా, షబ్బీర్, గౌస్ బాష, ఛోటు, ఇబ్రహీం, అబూబకర్, ఇలియాజ్, వసీం, దర్బార్ ఇబ్రహీం, అబూబకర్, ముజాహిద్ ఇస్లాం, ఖాదర్ బాష, రషీద్, షంషుద్దీన్, ముజీబ్, జన్నత్, ఇనాం, డాక్టర్ రిజ్వాన్, వసీం, మున్నా, హాషిం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల కోర్కెలను వెంటనే తీర్చాలి



వెంకటగిరి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిపో కార్యదర్శి కె.వి రత్నం రెండవరోజున వెంకటగిరి డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గేట్ మిట్టింగ్, ధర్నా డిపో వైస్ ప్రెసెడెంట్ కె.ఆర్.బాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమను ఉద్దేశించి డిపో సెక్రెటరీ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు పరచి ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ సతీష్ బాబు,డిపోవర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ డి ఏరాజక్, ఎస్ కే జి.భాష జిసుబ్బారావు, పి భాస్కర్, పివిజయకుమార్ బి.శ్రీహరి లతో పాటు గ్యారేజ్ సెక్రటరి కెలక్ష్మణ్ , ప్రెసెడెంట్, ఏఎం రాజా, నాగేంద్ర, కృష్ణ, విక్రం, ఇతర ఉద్యోగులు పాల్గొని రొండోవ రోజు ధర్నా కార్యక్రమము విజయవంతం అయింది.

## ప్రతి విద్యార్థి శాస్త్రజ్ఞుడే : నాదమునిరెడ్డి



రేణిగుంట ఏప్రిల్ 11 ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి గొప్ప శాస్త్రవేత్తని అన్న మాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాద మునిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అన్నమా చార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రెండు రోజులు జరిగే విద్యుత్ విభాగం ఏపివిజి 25 జాతీయస్థాయి సింపోయిజం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ నాదముని రెడ్డి ప్రారంభించారు. వివిధ కళాశాలలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులు ఆన్లైన్లో 250 మంది విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. విద్యుత్ తయారీకి సంబంధించిన అనేక నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రిన్సిపల్ నాదమునిరెడ్డి మాట్లాడుతూ ఏదైనా విద్యుత్ క్షేత్రమునందు ఉష్ణోగ్రత స్థిరంగా ఉన్నప్పుడు స్వేచ్ఛగా ప్రవహించే ఎలక్ట్రాన్లను కరెంట్ అని, ఎలక్ట్రాన్లను చెలింపజేసే శక్తిని వోల్టేజ్ అని, వోల్టేజ్ కు నిరోధం రెసిస్టెన్స్ అంటారని తెలిపారు. మొత్తం విద్యుత్ వ్యవస్థ ఈ సూత్రంపై ఆధారపడి ఉంటుందన్నారు. దీనినే ఓమ్స్ లా అని అభివర్ణించారు.ప్రతి విద్యార్థి తమ అభ్యసిస్తున్న అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యుత్తును ఎన్ని రకాలుగా తయారు చేయవచ్చో విసిదీకరించారు. నీరు,గాలి,బొగ్గు, సూర్యరశ్మి, తదితర ప్రకృతి ప్రసాదిత సహజ వనరుల నుండి విద్యుత్ తయారు చేయవచ్చు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రోత్సహిస్తున్న విద్యా సంస్థల గౌరవ చైర్మన్ గంగిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగాధిపతి బాలాజీ నందకుమార్ రెడ్డి, కళాశాల వివిధ శాఖధిపతులు, పిఆర్‌ఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కస్తూర్బా గాంధీ జన్మదిన వేడుకలు



తిరుపతి విద్య, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : తిరుపతి గాంధీ రోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ పి.సి. రాయులు ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ 156వ జయంతి వేడుకలు శుక్ర వారం అత్యంత ఘనంగా జరి గాయి. ఈ కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, ముబ్బు దేవనారాయణరెడ్డి, సామంచి శ్రీనివాసులు హాజరైనారు.ఈ సందర్భంగా మొదట అతిథులసే కస్తూర్బా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులచే కేక్ కట్ చేసి అనంతరం వేయి మందికి అన్నదానం,వస్త్ర దానం చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పి.సి.రాయులు మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా కస్తూర్బా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుతున్నామని, కస్తూర్బా గాంధీ దక్షిణాఫ్రికాలో గాంధీతో కలిసి భారతీయుల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహిళ అని, 1942లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమంలో, అనేక సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరములుగా అనేక సేవా కార్యక్రమాలు ముఖ్యంగా మహిళలకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, కృష్ణమూర్తి, ఉమాపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రానైట్ బాధిత బాలునికి గాలి జగదీశ్ సాయం



పుత్తూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : ఇటీవల చెర్లోపల్లి గ్రానైట్ పేలుళ్లలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొజ్జనత్తం ఎస్టీ కాలనీకి చెందిన రెండు సంవత్సరాల బాలుడు దినేష్‌ను, అతని తల్లితండ్రులు రమేష్, చెంచులక్ష్మిలను గాలి ముద్దుకృష్ణమ నాయుడు ట్రస్ట్ (జిఎంకె ట్రస్ట్) అధినేత గాలి జగదీశ్ ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు శుక్రవారం తిరుపతిలో బాలుడు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి తల్లితండ్రులను పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాలుడికి ఎడమ చేయి, వేళ్లు పనిచేయడం లేదని తల్లి ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే తలపై కపాలంలో ఇంకా పగుళ్లు కనిపిస్తున్నాయని, మరొక ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రస్ట్ తరపున తన వంతు సహాయం అందిస్తానని గాలి జగదీష్ బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు.

## తెదేపా కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి శుక్రవారం శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, పట్టణ బిసి అధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ముందుగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిసి పట్టణ అధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, కంటా రమేష్, రేణుకాదేవి, సుమతి, ప్రతాప్, మురళీ, ఆర్ముగం, శివారెడ్డి, దొరబాబు, నెమళ్ళూరు సుబ్రమణ్యం, మునిరాజ యాదవ్, నింద్రసుధాకర్, హేమంత్‌కుమార్, రవి, వివేక్, లోకేష్, చెన్నూరు భాస్కర్‌గౌడ్, గుర్రప్పశెట్టి, సతీష్, సుబ్బయ్య, గుత్తావిజయకుమార్, అనిల్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**బిసిలకు నిజమైన నాయకుడు జ్యోతిరావు పూలే:**

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కృషి చేసిన తొలితరం మహనీయులు ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మాజ్యోతిరావు పూలే నిజమైన బిసిల అభ్యుదయ వాది అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారిగురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, డా.జి.దశరధాచారి, వన్నె కులక్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి డైరెక్టర్ మిన్నల్‌రవి, పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు, సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి), బిసి విభాగం నాయకులు పేటబాలాజీరెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, నాగమల్లిదుర్గాప్రసాద్, కన్నావరం హరిబాబు, మునిరాజయాదవ్, ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, కోటచంద్రశేఖర్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఆదిశంకరలో ఘనంగా ప్రాజెక్టు మోడల్ ఎగ్జిబిషన్

గూడూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ప్రాజెక్టు మోడల్ ఎగ్జిబిషన్ ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ కాంపిటీషన్‌లో ఆదిశంకర కళాశాల విద్యార్థులతో పాటు వివిధ కళాశాల విద్యార్థులు వారి నూతన ఆవిష్కరణలను, ప్రాజెక్టు మోడల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులైన కె.నందకుమార్, కె.మస్తాన్‌వలి నియమించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వేణుమాధవ్ మాట్లాడుతూ ప్రదర్శన ద్వారా నూతన ఆవిష్కరణలను మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. ఈ ప్రదర్శన నిర్వాహకులు డాక్టర్ ఎ. ఇమ్మానుయేలు మాట్లాడుతూ వివిధ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం చాలా అభినందనీయమని తెలిపారు. కళాశాల ఈసిఈ విభాగ ప్రొపెసర్ డాక్టర్ కె. ధనుంజయ మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రదర్శన ఆదిశంకరలో ప్రతి సంవత్సరం ఆనవాయితీగా జరుగుతుందని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డా.ఎం. రాజయ్య,ఈసిఈ విభాగాధిపతి జె. అమరేంద్ర, జె.సురేష్, వి.శ్రీనాథశర్మ, వివిధ విభాగాధిపతులు, కళాశాల ఎఓ జె. రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోవుల మృతి ఘటనపై ఆవేదన చెందిన ఎంపీ

వెంకటగిరి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: గత మూడు మాసాలలో టీటీడీ గోశాలలో సుమారు 100 గోవుల మృతి చెందిన విషయంపై తిరుపతి ఎంపీ గురుమూర్తి తీవ్ర ఆందోళన చెందారు. హిందువులు గోవులను తల్లిగా భావించి గోమాత అని పిలుస్తారు. అలాంటి గోవులు ఇలాంటి దయనీయ స్థితిలో ఉండటం ఎంతో క్షోభను కలిగిస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ చర్యలను ఖండించారు. ఈ ఘటనతో టి.టి.డి గోశాల నిర్వహణ ఎలా ఉందో నిరూపితమైందని అన్నారు. గోశాలలోని గోవుల పట్ల నిర్లక్ష్యం ఏమాత్రం సహించరానిదని ఎంపీ స్పష్టం చేశారు.

## అంగన్వాడి సిబ్బంది విధులు సమర్థవంతంగా : ఎమ్మెల్యే



బాలాయపల్లి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: నూతనంగా నియమితులైన అంగన్వాడి సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలో నూతన ంగా నియమింపబడ్డ అంగన్వాడి వర్కర్లు, హెల్ప ర్లకు నియామక పత్రాలు ఆయన అందజేశారు. కామకూరు బి.సుమతి, అడిగేపల్లి మమత, జార్లపాడు వరమ్మ, అంబలపూడి ఐమాలకు నియా మక పత్రాలను అందజేశారు. అంగన్వాడి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సిడిపిఓ శంషాద్ బేగం, సూపర్వైజర్లు కల్ప లత, పరిమళ, మండల పార్టీ అధ్యక్షులు మస్తాన్‌నాయుడు, కోటేశ్వర్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఖజానా నిర్మాణం నోసుకొని పూర్తయ్యేది ఎప్పుడో



వాకాడు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: వాకాడులో ఉప ఖజానా కార్యాలయం నిర్మాణం నోసుకొని ఇకనైనా పూర్తి చేసేది ఉందా లేదా! వివరాల్లోకి వెళితే మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో 2018 సంవత్సరంలో సుమారు 75 లక్షల రూపాయలు నిర్మాణ వ్యయంతో ఉప ఖజానా కార్యాలయంనకు గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ అధ్యక్షతన అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి చేత శంకుస్థాపన చేసారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలు సంబంధించి వాకాడు ఉప ఖజానా కార్యాలయం ద్వారా ఉద్యోగస్తులకు, ప్రజా ప్రతినిధులుకు బిల్లులు పనులు జరిగేవి, గడిచిన వైసీపీ ప్రభుత్వంలో ఉప ఖజానా కార్యాలయం నిర్మాణం చేపట్టగా పిచ్చి మొక్కలుతో నిండిపోయింది. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి ట్రెజరీకి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## చారిటబుల్ ట్రస్ట్‌చే పాఠశాల ఆధునీకరణ



చిల్లకూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: మండలంలోని పాలిచర్ల వారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సిడబ్ల్యు ఎస్ఎన్ పాఠశాలను రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో 85వేల రూపాయల వ్యయంతో పాఠశాలను ఆధునీకరణ చేయించి శుక్రవారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశా లకు విచ్చేసిన దాత శ్రీనివాసులు నాయుడుకి విద్యార్థులు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మహమ్మద్ రావూఫ్,ట్రస్ట్ కార్యదర్శి రామయ్య నాయుడు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, రామచంద్రరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, సురేంద్ర, బాబు,భాస్కర్,మంజులశ్రీలు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం



గూడూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : లారీ ఢీకొనడంతో మహిళ రెండు కాళ్ళు నుజ్జు నుజ్జు అయిన సంఘటన గూడూరు పట్టణంలోని బనికెసాహెబ్ పేటలో శుక్రవారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న గూడూరు వన్ టవున్ ఎస్సై తిరుపతయ్య. ప్రమాదంలో గాయపడిన. పరిమళ అనేమహిళను నెల్లూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిచిందిస్తున్నారు కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నారు లారీ డ్రైవర్ను అదుపులో తీసుకొని విచారిస్తున్నారు.

## లారీబోల్తా - డ్రైవరుకు గాయాలు




నాయుడుపేట ఏప్రిల్ 11 ప్రభాతవార్త: నాయుడుపేట మల్లాం జంక్షన్‌వద్ద జాతీయ రహదారిపై లారీ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైనసంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. లారీ చెన్నై నుండి నెల్లూరుకు వెళుతుండగా మార్గమధ్యలో నాయుడుపేట మల్లాం జంక్షన్ వద్దకు వచ్చేసరికి రహదారిపై పోలీసులు ఏర్పాటు చేసిన భారీగేట్లును తప్పించబోయి లారీ అదుపుతప్పి ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దీంతో లారీ డ్రైవింగ్ చేస్తున్న సెల్వంకు గాయాలై, క్షతగాత్రుడిని 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేటలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు



నాయుడుపేట,ఏప్రిల్ 11 ప్రభాతవార్త: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసి జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహిం చారు. అనంతరం నెలవల సుబ్రమణ్యం జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసి సామాజిక వర్గాల అభ్యున్నత కోసం జ్యోతిరావుపూలే దంపతులు అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో మాజీ ఏఎంసి చేర్మేన్ శిరసనంబేటి విజయబాస్కర్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి, మున్సిపాల్టి వైస్‌చేర్మేన్ 786రఫి,మాజీ ఎంపిపి తుపాకుల కన్నెమ్మ,అవదానం సుదీర్, నానబాల సుబ్బారావు,మైలారీ రాజశేఖర్,తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలి : సిడిపిఓ




నాయుడుపేట ఏప్రిల్ 11 ప్రభాతవార్త ; చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారం అందించడం ద్వార ఆరోగ్యంగా ఉంటారని నాయుడుపేట సిడిపిఓ ఉమామహేశ్వరి తెలియజేశారు.పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పెళ్ళకూరు మండలం లోని చెంబడిపాళెం అంగన్‌వాడి కేంద్రంలో గర్భవతులు,బాలింతలకు పౌష్టిక ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ ఉమామహేశ్వరి మాట్లడుతూ గర్భవతులు మొదటిదశ 0-2సంవత్సరాల వరకు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు.చిన్నపిల్లలు వయస్సుకు తగిన ఎత్తుకు బరువు ఉండేవిధంగా తగిన ఆహారం అందించా లన్నారు. అనంతరం గర్భవతులకు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సి న జాగ్రర్తలపై పలుసూచనలు, సలహాలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంగన్‌వాడి టీచర్లు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## పన్ను మినహాయింపులను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్



పుత్తూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపుల్లో మినహాయింపును ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని పుత్తూరు మునిసిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఏక మొత్తంలో ఒకే సారి చెల్లిస్తే మొత్తం పన్నులో 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ నెలాఖరు వరకే ఈ సదుపాయం వుందని తెలిపారు. అలాగే ఇదే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నుల బకాయిలను ఈ నెల 30వ తేదీ లోగా చెల్లిస్తే పన్నులకు సంబంధించిన వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించినట్టు తెలిపారు. ఇళ్ల, ఖాళీ స్థలాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో మునిసిపాలిటీకి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.